# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

ఆదివారం 20 జూలై 2025 పేజీలు 8


అక్రమార్కుల ఎనిమిదేళ్ళ నిరీక్షణకు ఫలితం లభించింది.. ఇద్దరు కరెప్షన్ అధికారుల అండతో..! నిబంధనలు తుంగలోతొక్కి, 10 ఫీట్ల బండ్ల బాటను, 40 ఫీట్ల అక్రమ రోడ్డు నిర్మాణంతో..! వందకోట్లు విలువైన ప్రభుత్వ భుమికి ఎసరు పెట్టారు.. ఈ భూకబ్జా బాగోతంలో మున్సిపల్ కమిషనర్ అండ్ తహశీల్దార్‌తో పాటు, మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారి కూడా కీలకపాత్ర పోషించినట్లు ఆరోపణలు వస్తున్నాయి.. ఈ కబ్జా వ్యవహారంలో భిన్న కథనాలు చోటుచేసుకున్నాయి.. మున్సిపల్ కమిషనర్ అవగాహనా లేమితో, దుండిగల్ తహశీల్దార్‌కు సర్వే కోసం లేఖ జారీ చేయగా..! తహశీల్దార్ ఆదేశాలతో సర్వేయర్ సర్వే రిపోర్ట్ జారిచేసి, ప్రభుత్వ భుమిలో రోడ్డు నిర్మాణానికి కారణం అయ్యారు.. మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఆదేశాలతో తహశీల్దార్ కూల్చివేతలు చేపట్టినప్పటికీ..! యధావిధిగా పనులు చేపట్టి రోడ్డు పూర్తి చేశారు.. అంతా ముగిశాక జిల్లా కలెక్టర్ ఆర్డీవో విచారణకు ఆదేశించడం, శనివారం విచారణలో భాగంగా బౌరంపేట్ లోని సంబంధిత ప్రభుత్వ భూమిని ఆర్డీవో శ్యామ్‌ప్రకాష్ సందర్శించారు.. ఇక్కడ హాస్యాస్పద విషయం ఏమిటంటే, ఆరోపణలు ఎదుర్కొంటున్న తహశీల్దార్‌కే నివేదిక ఇవ్వాల్సిన బాధ్యతను అప్పగించడం పలు విమర్శలకు తావిస్తోంది..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూలై 19



# అక్రమ రోడ్డు నిర్మాణంలో..! అధికారుల డ్రామా..!

## ఆర్డీవో విచారణలో..! తహశీల్దార్‌ను నివేదికకి ఆదేశం..!

## సర్వేచేసి ప్రభుత్వ భూమిని కట్టబెట్టిన తహశీల్దార్‌కి, నివేదిక బాధ్యత సరైనదేనా..?

-2లో

- బౌరంపేట్ సర్వే నెం.166 ప్రభుత్వ భూమిపై ఆర్డీవో విచారణ సవ్యంగా కొనసాగుతుందా.?
- అడిషనల్ కలెక్టర్ చర్యల ఆదేశాలే బేఖాతర్ చేసి.. సీఎంవో సిఫార్సులు అన్నారు..
- ఆర్డీవో విచారణకు "సీఎంవో" ఫోన్‌ల బెడద ఉండదా..? ప్రభుత్వ భూమిని కాపాడేనా..?
- కబ్జాలు చేయడానికి తెలంగాణ సీఎంవో కార్యాలయం వేదికగా మారబోతుందా..?
- నాటి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మించి.. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందా..?
- సీఎం సన్నిహితుడకి రాచ మర్యాదలతో ప్రభుత్వ భూమిని కట్టబెట్టడతారా..?
- ఇంత చేసినోళ్ళు..! విచారణకి ఆదేశించిన జిల్లా కలెక్టర్‌కి "సీఎంవో" ఫోన్‌లు చేయరా..?
- బడా బిల్డర్‌ల పాచికలు ఫలించాయి..! 8 ఏళ్ళ అనుమతుల నిరీక్షణకు తెరపడింది..
- తెలంగాణలో అవినీతి అధికారులకు..! అక్రమార్కులకే ప్రాధాన్యత, ఇదీమన రాష్ట్రం.
- రాష్ట్రాన్ని మేమే సాధించామన్న బీఆర్ఎస్..! ఇప్పుడు కాంగ్రెస్..! ఇద్దరి ధ్యేయం ఒక్కటే..!
- తెలంగాణలో కరెప్షన్ భూతాన్ని పెంచి పోషిస్తున్న పాలకులు..





# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఘన విజయం సాధిస్తాం



- త్వరలో జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక
- ఉప ఎన్నికలో గెలుపుపై పార్టీల ధీమా
- కాంగ్రెస్‌దే విజయమన్న మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్ పెన్ పవర్:జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధిస్తుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఉన్న మాగంటి గోపీనాథ్ గత నెలలో మృతి చెందడంతో ఇక్కడ ఉప ఎన్నిక రానుంది.

-3లో

# ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు సిట్ రెండోసారి నోటీసు

హైదరాబాద్ పెన్ పవర్: ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ IPS అధికారి,బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు సిట్ రెండో నోటీసు ఇచ్చింది. జులై 14 న సిట్ నోటీసులకు స్పందించక పోవడంతో రెండో సారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కు సిట్ నోటీసులు జారీ చేసింది. వారం రోజుల్లో విచారణకు హాజరై వాంగ్మూలం ఇవ్వాలని తాజా నోటీస్‌లో

-3లో



# అక్రమ రోడ్డు నిర్మాణంలో..! అధికారుల డ్రామా..!

**కేవలం 40 ఫీట్ల రోడ్డు లేదని.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుండి, ఎనిమిదేళ్ళుగా హెచ్ఎండిఏ అనుమతులు లభించని, వెంచర్‌కి..! దుండిగల్ మున్సిపల్ కమిషనర్, దుండిగల్ తహశీల్దార్ చిటికెలో పనిపూర్తి చేశారు..ప్రస్తుతం ఆర్డీవో విచారణ కేవలం, ప్రశ్నించే వారికోసం..తాత్కాలిక ఉపశమనానికి మందు మాత్రమేనని ఆరోపణలు వస్తున్నాయి బౌరంపేట్ సర్వే నెం.166 ప్రభుత్వ భూమి, బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆపార్టీ నేతల గెస్ట్‌హౌస్‌ల నిర్మాణాలకు కేటాయించిన దుండిగల్ రెవెన్యూ అధికారులు..! ఇప్పుడు అదే బౌరంపేట్ సర్వే నెం.166 ప్రభుత్వ భూమిని, అధికార కాంగ్రెస్ పార్టీ నేతలకు కట్టబెడుతున్నది కూడా దుండిగల్ రెవెన్యూ అధికారులే..! నేతల మెప్పు పొందడానికి, రూ. కోట్లు విలువైన భూమిని ధారాదత్తం చేస్తున్నారు.. తిలాపాపం తలాపిడికెడు అన్న చందంగా..! దొంగలు దొంగలు ఊర్లు పంచుకుంటున్నారని దుమ్మెత్తిపోస్తున్నారు.. రైతుల పేరుతో అక్రమార్కులతో ఒప్పందం కుదుర్చుకుని, కోట్ల కుంభకోణానికి తెరలేపారు.. ఏదిఏమైనప్పటికీ విచారణ అధికారి ఆర్డీవో శ్యామ్‌ప్రకాష్, పారదర్శకతతో, నివేదికను కలెక్టర్‌కి సమర్పించినా..! కలెక్టర్‌కి కూడా "సీఎంవో" సిఫార్సులు ఉండవని గ్యారంటీ ఏమిలేదు.. ఇదంతా ఒక ఫార్మాలిటీ కోసమేనని విమర్శించే వారు లేకపోలేదు..**





మేడ్చల్ జిల్లా దుండిగల్ మండలం బౌరంపేట్ సర్వే నెం.166 ప్రభుత్వ భూమిలో, అధికారుల బరితెగింపుతో అక్రమార్కులకు 40 ఫీట్ల రోడ్డు నిర్మాణంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.. పత్రికల్లో వచ్చిన వార్తా కథనాలకు, నిప్పుల మీద నీళ్ళు చల్లిన చందంగా,మల్కాజిగిరి ఆర్డీవోను కలెక్టర్ విచారణకు ఆదేశించడం ఒక వంతైతే..! విచారణలో భాగంగా శనివారం దుండిగల్ మండలం బౌరంపేట్ సర్వే నెంబర్ 166 ప్రభుత్వ భుమిని సర్వేయర్‌తో సందర్శించి, సర్వే చేసిన ఆర్డీవో శ్యామ్‌ప్రకాష్, దుండిగల్ తహశీల్దార్‌ను నివేదిక ఇవ్వాలని ఆదేశించడం విడ్డూరంగా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు..బడా నిర్మాణ సంస్థలకు, హెచ్ఎండిఏ అనుమతులు లభించే అవకాశాన్ని కల్పించే,ఈ అక్రమ రోడ్డు నిర్మాణంలో కీలకంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు అధికారుల్లో ఒకరైన దుండిగల్ తహశీల్దార్ మతీన్ నుండి నివేదిక కోరడం, సవ్యంగనే ఉంటుందా..? కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీవో విచారణ, సహకరించిన ఎమ్మార్వో నివేదిక ఎలా ఉండబోతోంది..! వక్రమార్గంలో తప్పుడు రోడ్డుకి, ఆర్డీవో విచారణకు, తహశీల్దార్ నివేదికట, ప్రజలను మభ్యపెట్టేందుకు కాకపోతే, అర్ధం లేని విచారణలు అవసరమా అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..

## తహశీల్దార్‌కి- కమిషనర్ పై అధికారా..?

**దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేష్ నాయక్, మాస్టర్ ప్లాన్ రోడ్డు అంటూ..! అవగాహనా రాహిత్యంతో లేకను పంపించిన వెంటనే డూడూ బసవన్నలా తలూపుతూ..! సర్వేయర్‌ని సర్వేకు ఆదేశించడం, ఉన్నతాధికారులకు కూడా తహశీల్దార్ మతీన్ సమాచారం ఇవ్వకుండా..! సొంత నిర్ణయాలతో వ్యవహరించి, విధులు తాకట్టు పెట్టి, ప్రభుత్వ భూములను బహిరంగంగా అక్రమార్కులకు కట్టబెట్టేందుకు భారీ డీల్ కుదిరినట్టు స్పష్టమవుతుంది.. మేడ్చల్ జిల్లా రెవెన్యూ యంత్రాంగం, అండ్ జిల్లా లోకల్‌బాడీ పరిధ్‌ఇలోని దుండిగల్ మున్సిపల్ అధికారుల పర్యవేక్షణలో భారీ కుంభకోణానికి పాల్పడినట్లు వస్తున్న ఆరోపణలకు బలం చేకూరుతుంది.. మాస్టర్ ప్లాన్ రోడ్డుకి హెచ్ఎండిఏ నోట్‌ఫైల్ ఏది కమిషనర్ వెంకటేష్ నాయక్..? ప్రభుత్వ భూమిలో రెవెన్యూ ఉన్నతాధికారుల ఆదేశాలు గానీ, రెవెన్యూ ఎన్‌వోసి గాని, లేకుండా ఎవరి ఆదేశాలతో సర్వే చేసి 166 ప్రభుత్వ భూమిని, తహశీల్దార్ మతీన్ కబ్జాదారులకు అప్పగించారు..?**


## ఎవరి ఆదేశాలతో..!

## కమిషనర్ లేఖ జారీచేశారు..?

ఉన్నతమైన విధుల్లో ఉన్న అధికారులు అవగాహనా రాహిత్యంతో వ్యవహరిస్తున్నారు.. ఇప్పటికే దుండిగల్ మున్సిపాలిటీని అక్రమ కట్టడాలతో కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారి భ్రష్టు పట్టిస్తుండగా..! హెచ్ఎండిఏ మాస్టర్ ప్లాన్ రోడ్డు పేరుతో, అధికారపార్టీ గల్లీ నాయకులకు, అవసరం లేని అక్రమ రోడ్డు కోసం.. దుండిగల్ కమిషనర్ అధికార దుర్వినియోగానికి పాల్పడటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.. తహశీల్దార్‌కి ఏ అధికారంతో లేఖను పంపించారో..! ఏ ఉన్నతాధికారుల ఆదేశాలు, నోట్‌ఫైల్ ఆధారంగా కమిషనర్ రోడ్డు సర్వేకి లేఖ రాశారో ఆర్డీవో శ్యామ్‌ప్రకాష్ కూలంకషంగా విచారణ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు..


పెన్ పవర్
తెలంగాణ రౌండప్
వాట్ ఏన్ ఐడియా సర్జీ..!


పెన్ పవర్
తెలంగాణ రౌండప్
బడా వెంచర్లకోసం బరితెగింపు..!


పెన్ పవర్
తెలంగాణ రౌండప్
రూ. 100 కోట్ల భూమికి ఎసరు..?


పెన్ పవర్
తెలంగాణ రౌండప్
అంతా.. మా ఇష్టం..! మా ప్రభుత్వం..!





## శ్లోక ద గ్లోబల్ స్కూల్ లో ఘనంగా బోనాల ఉత్సవాలు



ఎల్బీనగర్ పెన్ పవర్ జూలై 19 : తెలంగాణ రాష్ట్ర సంస్కృతీ సాంప్రదాయాలను ప్రతిబింబించేలా, శ్లోక ద గ్లోబల్ స్కూల్ అల్కాస్ గూడ శాఖ ప్రాంగణంలో విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. బోనాల పండుగను విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో బోనం ఊరేగింపు, పాటలు, నృత్యాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. బోనాల ఉత్సవాల్లో స్కూల్ చైర్మన్ జైపాల్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అంజనశ్రీ, ప్రిన్సిపాల్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల్లో మన సంస్కృతి సంప్రదాయాల పట్ల గౌరవం పెంపొందించేలా ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల సహకారంతో ఈ వేడుక ఎంతో జ్ఞాపకాలతో పూర్తయింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు సిట్ రెండోసారి నోటీసు

- మొదటి పేజీ తరువాయి

సిట్ స్పష్టం చేసింది. ఎప్పుడు హాజరు అవుతారో తమకు ముందుగానే సమాచారం ఇవ్వాలని సిట్ కోరింది.తన ఫోన్ బీఆర్ఎస్ ప్రభుత్వం హ్యాక్ చేస్తుందని, ఫోన్ ట్యాపింగ్?కి పాల్పడుతుందని గతంలో BSP రాష్ట్ర అధ్యక్షుడు హోదాలో ఈసీ, డీజీపీకి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఫిర్యాదు చేశారు. దాని ఆధారం గానే సిట్ ప్రవీణ్ కుమార్ స్టేట్మెంట్ రికార్డ్ చేయనుంది. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో %?% ప్రవీణ్ కుమార్ ఫోన్ ట్యాప్ అయినట్లు సిట్ గుర్తించింది. పోలీస్ డిపార్ట్మెంట్‌లో కీలక విభాగాల్లో పనిచేసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల సొసైటీ సెక్రటరీగా పనిచేస్తూ 2021 జులైలో వీఆర్ఎస్ తీసుకుని బీఎస్పీలో చేరారు. అప్పటి నుంచి ఆర్ఎస్‌పీ కదలికల పైనా బీఆర్ఎస్ సర్కార్ నిఘా పెట్టింది. ఆర్ఎస్‌పీ ఫోన్?ను ట్యాప్ చేసి ఆయన ప్రతి కదలికనూ సర్కారు పెద్దలకు ప్రణీత్‌రావు టీమ్ చేరవేసింది.

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఓడిపోయారు. అయితే, ఫోన్ ట్యాపింగ్?తో ఆర్ఎస్‌పీ లోటు పాట్లు తెలుసుకుని, బీఆర్ఎస్ లో చేరేలా పావులు కదిపారని అప్పట్లో జోరుగా ప్రచారం జరిగింది. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఐఎఎస్ దివ్యా దేవరాజన్, సిటీ మాజీ జాయింట్ సీపీ ఏఆర్ శ్రీనివాస్ తో పాటు ఓ హైకోర్టు జడ్జి భార్య ఫోన్లను కూడా ట్యాప్ చేసినట్లు సిట్ గుర్తించింది.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఘన విజయం సాధిస్తాం

- మొదటి పేజీ తరువాయి

ఈ ఉప ఎన్నికలో గెలుపుపై అన్ని పార్టీలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.తాజాగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమని అన్నారు. అంతకుముందు, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పలువురు నేతలు కాంగ్రెస్‌లో చేరారు. ఎంపీ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మురళీ గౌడ్, సంజయ్ గౌడ్ పార్టీలో చేరగా, వారికి మహేశ్ కుమార్ గౌడ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

# సమస్యలను పరిష్కరించేందుకు న్యాయ సేవా సంస్థ కృషి: హైకోర్టు న్యాయమూర్తి సామ్ కోశి



ఎల్బీనగర్ పెన్ పవర్ జూలై 19: రంగారెడ్డి జిల్లా న్యాయ సహాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఎల్బీనగర్ లోని రంగారెడ్డి జిల్లా న్యాయ సేవా సదన్ భవనంలో మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి సామ్ కోశి ముఖ్య అతిథిగా హాజరై మధ్యవర్తిత్వం ప్రాముఖ్యతపై ప్రసంగించారు. మధ్యవర్తిత్వం అనేది న్యాయపరమైన సాధనం మాత్రమే కాదని, అది వ్యక్తిగత, సామాజిక స్థాయిలో శాంతియుతంగా సమస్యలను పరిష్కరించే మార్గమని అన్నారు. ఇది సమయం, ధనం, సంబంధాలను కాపాడే శక్తివంతమైన సాధనమని తెలిపారు. వివాదాలను కోర్టుల వరకూ తీసుకెళ్లకుండానే పరిష్కరించేందుకు మధ్యవర్తిత్వం ఒక ఉత్తమమైన ప్రత్యామ్నాయ మార్గమని, కుటుంబం, ఆస్తి, వాణిజ్య సంబంధిత కేసుల్లో ఇది ఎంతో ప్రయోజనకరమని ఆయన వివరించారు. న్యాయ స్థానాల భారం తగ్గించేందుకు ప్రతిఒక్కరూ దీనిని మొదటి మెట్టుగా పరిగణించాలని పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్ మాట్లాడుతూ మధ్యవర్తిత్వ అవగాహన కార్యక్రమం ఎంతో ప్రాముఖ్యత గలదని అన్నారు. న్యాయవ్యవస్థ మీద పెరుగుతున్న భారాన్ని తగ్గించడమే కాకుండా, ప్రజలకు త్వరితగతిన, న్యాయమైన, శాంతియుత పరిష్కారం అందించడంలో మధ్యవర్తిత్వం పని చేస్తుందని తెలిపారు. ఒక బలమైన పథమని, మధ్యవర్తిత్వం ద్వారా వ్యక్తుల మధ్య సంబంధాలు నిలబడతాయన్నారు.కోర్టు చార్జీలు తగ్గుతాయని, ప్రతిపక్షం సంతృప్తిగా ఒప్పందానికి వస్తుందని అన్నారు. ఈ విధానాన్ని అందరూ ప్రోత్సహించాలని సూచించారు. న్యాయవాదులు కూడా తమ క్లయింట్లను ముందుగా మధ్యవర్తిత్వం వైపు మలచాలని అన్నారు. ఇది న్యాయం కోరే ప్రతిఒక్కరికీ మేలైన మార్గమని తాను విశ్వసిస్తున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రతాప్ రెడ్డి, న్యాయవాదులు, మధ్యవర్తులు, పారా లీగల్ వాలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# వర్షం తెచ్చిన తంటా.. ఇబ్బందుల్లో హైదరాబాదీలు




హైదరాబాద్ పెన్ పవర్:హైదరాబాద్ లో భారీ వర్షం కురుస్తుంది. గత రెండు గంటల నుంచి కురుస్తున్న వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రధానంగా ఉప్పల్, ఉస్మానియా యూనివర్సిటీ, విద్యానగర్, నల్లకుంట, ఎల్బీనగర్, చైతన్యపురి, దిల్ సుఖ్ నగర్, సరూర్ నగర్ , సికింద్రాబాద్, మేరేడుపల్లి, చిలకలగూడ ప్రాంతాల్లో భారీ వర్షం నమోదయింది. రోడ్లపైకి వరద నీరు చేరడంతో విద్యాసంస్థల నుంచి బయలుదేరిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా స్కూలు బస్సులు, ఆటోలు వర్షపు నీటిలో చిక్కుకున్నాయి. రోడ్డు మీద నీరు చేరడంతో కొన్ని చోట్ల మొరాయించాయి. దీంతో వాహనాలను తోసుకుని ముందుకు రావాల్సి వచ్చింది. ఇంజిన్ లోకి నీరు పోవడంతో ద్విచక్ర వాహనాలు మొరాయించాయి.

**వీకెండ్ కావడంతో...**

వీకెండ్ కావడంతో హైదరాబాద్ నగరంలో ప్రయివేటు వాహనాలన్నీ బయటకు వచ్చాయి.దీంతో రహదారుల్లో ట్రాఫిక్ మరింతగా స్తంభించిపోయింది. వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరికలు జారీ చేసింది. వీలయినంత వరకూ ఈరోజు కూడా బయటకు రాకుండా ఇంట్లోనే ఉండాలని, భారీ వర్షం నమోదయ్యే అవకాశముందని చెప్పింది. కొన్ని ప్రాంతాల్లో వర్షపు నీరు ఇళ్లలోకి చేరాయి. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరడంతో వస్తువులన్నీ వర్షార్పణమయ్యాయి. భారీ వర్షం కురియడంతో అనేక ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాను అధికారులు నిలిపివేశారు. దీంతో చీకట్లు అలుముకుని నీరు బయటకు తోడుకోలేక ప్రజలు అవస్థలు పడ్డారు.

**మ్యాన్ హోల్స్ మూతలు తెరిచి...**

హైదరాబాద్ నగరంలో వర్షం వచ్చినప్పుడల్లా ఇదే పరిస్థితి తలెత్తుతోంది. మ్యాన్ హోల్స్ ను దుకాణ యజమానులు తీసి వేస్తుండటంతో ప్రమాదకరంగా మారింది. మ్యాన్ హోల్స్ మూతలను ఎవరూ తొలగించవద్దని, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ సిబ్బంది మాత్రమే తొలగిస్తారని, వారు తొలగిస్తే అక్కడ బోర్డులను ఏర్పాటు చేస్తారని, అప్పుడు ప్రమాదాలు జరగవని చెబుతున్నారు. అయినా కొందరు దుకాణాల యజమానులు వర్షపు నీరు తమ దుకాణాల్లోకి రాకుండా మ్యాన్ హోల్స్ తెరుస్తున్నారు. మలక్ పేట్ వద్ద రహదారిపై మ్యాన్ హోల్స్ తొలగించడంతో అక్కడ దుకాణాల యజమానులతో మున్సిపల్ సిబ్బంది గొడవకు దిగారు. కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## హైదరాబాద్‌లో భారీ వర్షం.. పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ నగరంలో భారీ వర్షం కురిసింది. ఉప్పల్, ఎల్బీనగర్, నాగోల్, ఉస్మానియా విశ్వవిద్యాలయం, విద్యానగర్, నల్లకుంట, సికింద్రాబాద్, జవహర్ నగర్, మారేడ్‌పల్లి, చిలకలగూడ, కూకట్‌పల్లితో పాటు పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. నగరంలో కురిసిన వర్షానికి ప్రధాన రహదారులపైకి నీరు చేరింది.దీంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అయింది. పంజాగుట్ట–లింగంపల్లి మార్గంలో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. పలుచోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. బేగంపేట ప్రాంతంలో కూడా భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ట్రాఫిక్ రద్దీని క్రమబద్ధీకరించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. గచ్చిబౌలి, హైటెక్ సిటీ, మాదాపూర్ ప్రాంతాల్లోనూ ట్రాఫిక్ నిలిచిపోయింది.

## మరిదితో అక్రమ సంబంధం.. నిద్రమాత్రలు, కరెంట్ షాక్ తో భర్త హత్య!




**హైదరాబాద్ పెన్ పవర్:**ఇటీవల కాలంలో అక్రమ సంబంధాల మోజుతో కొందరు మహిళలు దారుణాలకు తెగిస్తున్నారు. కట్టుకున్న భర్తను కడతేర్చడానికి కూడా వెనుకాడడంలేదు. దిల్లీలోని దో్రహ్‌లోనూ ఇలాంటిదే ఒక షాకింగ్ సంఘటన జరిగింది. సుష్మిత అనే మహిళ తన భర్త కరణ్ దేవ్‌ను తన మరిది (భర్త సోదరుడు)తో కలిసి హత్య చేసింది. ఈ ఘటన జులై 13న బయటపడింది. తన భర్త విద్యుత్ షాక్‌కు గురయ్యాడంటూ ఆసుపత్రికి తీసుకొచ్చింది. అయితే, పోలీసులు విచారించగా, ఆశ్చర్యకరమైన విషయాలు తెలిసాయి. సుష్మిత కొంతకాలంగా తన మరిదితో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. వీరిద్దరూ కలిసి కరణ్‌ను చంపాలని ప్లాన్ చేశారు. రాత్రి భోజనంలో కరణ్‌కు మత్తు మాత్రలు కలిపారు. అతను స్పృహ తప్పిన తర్వాత, విద్యుత్ షాక్ ఇచ్చి చంపారు. దీన్ని ప్రమాదంగా చూపించాలని ప్రయత్నించారు. కాగా, నిద్ర మాత్రలు ఎంత సమయంలో పనిచేస్తాయో తెలుసుకోవడానికి వారు గూగుల్‌లో కూడా వెతికారు.సుష్మిత చెప్పిన ప్రకారం, కరణ్ ఆమెను తరచూ కొట్టి, డబ్బు అడిగి, మానసికంగా వేధించేవాడు. అందుకే ఈ హత్యకు పాల్పడినట్లు ఆమె తెలిపింది. పోలీసులు సుష్మితను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశారు. ఈ సంఘటన స్థానికులను షాక్‌కు గురి చేసింది.

# చంద్రుడిపై మట్టిలో ‘మాయాజాలం’!

- చైనా శాస్త్రవేత్తల అద్భుత ఆవిష్కరణ
- చంద్రునిపై ఉన్న మట్టి నుంచి నీటిని సంగ్రహించగలిగే టెక్నాలజీ
- ఆ నీటితో కార్బన్ డై ఆక్సైడ్ ను ఆక్సిజన్, ఇతర రసాయనాలుగా మార్చే సాంకేతికత




**హైదరాబాద్ పెన్ పవర్:**చంద్రునిపై మానవాళి జీవనం పట్ల కొత్త ఆశలు కలుగుతున్నాయి. చంద్రునిపై జీవన సాధ్యతను పెంచే ఒక సంచలనాత్మక ఆవిష్కరణను చైనా శాస్త్రవేత్తలు సాధించారు. జర్నల్ జౌల్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం, చంద్రుని ఉపరితలంపై ఉన్న మట్టి నుంచి నీటిని సంగ్రహించి, దానిని ఉపయోగించి కార్బన్ డై ఆక్సైడ్‌ను ఆక్సిజన్ మరియు ఇంధన సంబంధిత రసాయనాలుగా మార్చగలిగే సాంకేతికతను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఈ ఆవిష్కరణ భవిష్యత్ అంతరిక్ష పరిశోధనలకు కీలకమైన అడుగుగా నిలుస్తుంది. ఎందుకంటే ఇది భూమి నుంచి నీరు, ఆక్సిజన్, మరియు ఇంధనం వంటి అవసరమైన వనరులను రవాణా చేయాల్సిన అవసరాన్ని తగ్గిస్తుంది. చైనా యూనివర్సిటీ ఆఫ్ హాంకాంగ్, షెన్‌జెన్‌కు చెందిన లు వాంగ్ ఈ పరిశోధన గురించి మాట్లాడుతూ, “చంద్రునిపైని మట్టిలో ఉన్న ‘మాయాజాలం’ మమ్మల్ని ఆశ్చర్యపరిచింది. ఈ సమగ్ర విధానం యొక్క గణనీయమైన విజయం మమ్మల్ని ఎంతగానో ఆకర్షించింది” అని అన్నారు. ఈ కొత్త సాంకేతికత ద్వారా చంద్రుని మట్టి నుంచి నీటిని సంగ్రహించడం మరియు దానిని ఉపయోగించి కార్బన్ డై ఆక్సైడ్‌ను కార్బన్ మోనాక్సైడ్ (%జూ%) మరియు హైడ్రోజన్ గ్యాస్‌గా మార్చడం సాధ్యమైంది. ఈ ఉత్పత్తులు ఆక్సిజన్ మరియు ఇంధన ఉత్పత్తికి ఉపయోగపడతాయి, ఇవి అంతరిక్ష యాత్రికులకు శ్వాసించడానికి మరియు ఇంధన అవసరాలకు అవసరమవుతాయి. ఈ అధ్యయనం ప్రకారం, ఒక గ్యాలన్ నీటిని రాకెట్ ద్వారా చంద్రునికి రవాణా చేయడానికి సుమారు 83,000 డాలర్లు (సుమారు 69 లక్షల రూపాయలు) ఖర్చు అవుతుంది. ఒక్కో అంతరిక్ష యాత్రికుడు రోజుకు సుమారు నాలుగు గ్యాలన్ల నీటిని వినియోగిస్తాడు. గతంలో అభివృద్ధి చేయబడిన నీటి సంగ్రహణ పద్ధతులు శక్తిని ఎక్కువగా వినియోగించేవి మరియు %జూ%2ను ఇంధనంగా మార్చలేకపోయేవి. కానీ, ఈ కొత్త సాంకేతికత ఈ సమస్యలను అధిగమించిందని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ ఆవిష్కరణ చంద్రునిపై స్థిరమైన మానవ నివాసాల ఏర్పాటుకు ఒక ముఖ్యమైన ముందడుగుగా భావిస్తున్నారు. అయితే, చంద్రుని కఠినమైన వాతావరణం, మట్టి యొక్క వైవిధ్యమైన రచన, మరియు ప్రస్తుత ఉత్ప్రేరక పరిమితులు ఇంకా సవాళ్లుగా ఉన్నాయని పరిశోధకులు సూచించారు. ఈ సాంకేతిక సవాళ్లను అధిగమించడం ద్వారా చంద్రునిపై జీవన సాధ్యతను మరింత బలోపేతం చేయవచ్చని వారు ఆశిస్తున్నారు.

# లోకేశ్‌ను కలవలేదని చెబుతూనే కలిస్తే తప్పేమిటని కేటీఆర్ అంటున్నారు: సంపత్ కుమార్

- కేటీఆర్ మాటలు రోజురోజుకు శృతి మించుతున్నాయన్న కాంగ్రెస్ నేత
- కేటీఆర్ పుస్తకంలో ఒక పుటను మాత్రమే చదివామని వ్యాఖ్య
- సమయం వచ్చినప్పుడు మిగిలిన పుస్తకాలను బయటపెడతామని హెచ్చరిక




**హైదరాబాద్ పెన్ పవర్:**ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్‌ను కలవలేదని చెబుతూనే, మరోవైపు కలిస్తే తప్పేమిటని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పడం విడ్డూరంగా ఉందని ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ అన్నారు. కేటీఆర్ మాటలు రోజురోజుకు శృతి మించుతున్నాయని ఆయన ధ్వజమెత్తారు. గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, కేటీఆర్ కంటే ఎక్కువ మాట్లాడగలనని అన్నారు. “కేటీఆర్, నీ పుస్తకంలో ఇప్పటి వరకు ఒక పుటను మాత్రమే చదివాం. ఇంకా చాలా కథ ఉంది. ‘రావుగారి రాసలీలలు’, ‘కల్వకుంట్ల కథాకమిస్ట్’, ‘తారక్ తోడేలు’ అనే మూడు పుస్తకాలు ఉన్నాయి. సమయం వచ్చినప్పుడు ఆ పుస్తకాలను బయటపెడతాం” అని హెచ్చరించారు. కేటీఆర్ కంటే ఎక్కువ భాష మాట్లాడగలనని, అలా మాట్లాడితే తట్టుకోలేవని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రిని ఉద్దేశించి మాట్లాడే పద్ధతిని నేర్చుకోవాలని అన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటే తమ జిల్లా పెండింగ్ పనులు అవుతాయని కొల్లాపూర్ ప్రజలు కోరుకుంటున్నారని, రేవంత్ రెడ్డి మరో పది, పదిహేనేళ్లు సీఎంగా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని, అదే మాటలను రేవంత్ రెడ్డి చెప్పారని ఆయన వెల్లడించారు. జనం కోరుకుంటున్న దానినే ముఖ్యమంత్రి తన వ్యాఖ్యల ద్వారా చెప్పారని అన్నారు.

# బండిపైనే ఈటల తూటాలు.. ఇక యుద్ధం మొదలయినట్లేనా?




**హైదరాబాద్ పెన్ పవర్:** మల్కాజ్ గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ కు, కేంద్ర మంత్రి బండి సంజయ్ కు మధ్య ఏదో తేడా వచ్చినట్లు కనిపిస్తుంది. ఇద్దరి నేతల మధ్య ఆధిపత్య పోరు నడుస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది. ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలతో నేరుగా బండి సంజయ్ పైనే ఆరోపణలు చేసినట్లు స్పష్టంగా కనపడుతుంది. కరీంనగర్ పార్లమెంటు సభ్యుడిగా బండి సంజయ్, మల్కాజ్ గిరి పార్లమెంటు సభ్యుడిగా ఈటల రాజేందర్ 2024 లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో గెలిచారు. అయితే ఇద్దరూ బీసీ సామాజికవర్గానికి చెందిన వారు కావడంతో కేంద్రంలో అధికారంలోకి రావడంతో మంత్రి పదవి ఇద్దరూ ఆసక్తి చూపారు. కానీ చివరకు ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న బండి సంజయ్ కే కేంద్రమంత్రి పదవి లభించింది.

**రాష్ట్ర అధ్యక్ష పదవి విషయంలోనూ...**

అదేసమయంలో కేంద్ర మంత్రి పదవి రాకపోయినా కనీసం రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవి వస్తుందేమోనని ఈటల రాజేందర్ చూశారు. 2023 ఎన్నికలకు ముందు బీజేపీలో ఈటల రాజేందర్ చేరారు. అయితే ఆయన నక్సల్ ఉద్యమం నుంచి తెలంగాణ ఉద్యమంలోకి తర్వాత బీఆర్ఎస్ లోకి అనంతరం బీజేపీలోకి వచ్చారు. బీజేపీ సిద్ధాంతాలకు, ఈటల గతానికి సంబంధమే లేదు. అందుకే ఈటల రాజేందర్ కు పదవి లభించలేదన్నది పార్టీ వర్గాల నుంచి వినిపిస్తున్న టాక్. తనకు రాష్ట్ర అధ్యక్ష పదవి రాకపోవడానికి బండి సంజయ్ ప్రధాన కారణమని ఈటల రాజేందర్ నమ్ముతున్నారు. అంతేకాకుండా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గంలోని హుజూరాబాద్ నియోజకవర్గంలో ఈటల అనుచరులకు కూడా పదవులు అందకుండా బండి సంజయ్ చేస్తున్నారని ఈటల రాజేందర్ అనుమానిస్తున్నారు. పార్టీలో ఎలాంటి గ్రూపులకు అవకాశం ఉండదన్న బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు ఈటల వర్గానికి సూటిగా తాకాయి.

**ఈటల స్ట్రయిట్ వార్నింగ్...**

రెండు రోజుల క్రితం ఈటల ప్రధాన అనుచరుడు, హుజూరాబాద్ బీజేపీ నేత రాజీనామా చేయడం వెనక ఈటల హస్తం ఉందని కూడా తెలిసింది. అందుకే ఈటల ఈరోజు నేరుగా బండి సంజయ్ పేరును ప్రస్తావించకపోయినా ఆయనకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చినట్లు అర్థమవుతుంది. హైదరాబాద్ లో హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి వచ్చిన కార్యకర్తలతో ఈటల రాజేందర్ మాట్లాడారు. తనపై కుట్ర జరుగుతుందన్నారు. సోషల్ మీడియాలో తనపై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. కోవర్టుల వల్లే ఇది జరుగుతుందని, దీనిపై తాను హైకమాండ్ కు ఫిర్యాదు చేస్తానని కూడా చెప్పారు. అంతేకాదు. తాను బీజేపీలోకి వచ్చిన తర్వాతనే మొన్న జరిగిన పార్లమెంటు నియోజకవర్గం ఎన్నికల్లో యాభై వేల మెజారిటీ బీజేపీకి వచ్చిందని ఈటల రాజేందర్ గుర్తు చేశారు. తాను వచ్చిన తర్వాతన... తాను రాకముందు ఎంత మెజారిటీ వచ్చిందో తెలుసుకోవాలన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో సర్పంచ్ లకు బీఫారాలు అవసరం లేదని, మనోళ్లను పోటీకి నిలబెడదామని ఈటల రాజేందర్ అనడంతో ఇక వార్ వీధుల్లోకి వచ్చినట్లయిందన్న కామెంట్స్ వినపడుతున్నాయి.

# నెలకు ఆరు వేల భరణం కట్టలేక.. సెకండ్ వైఫ్‌ను పోషించలేక.. చైన్ స్నాచర్‌గా మారిన భర్త !



**హైదరాబాద్ పెన్ పవర్:** దొంగతనాల వెనుక మోటో కొన్నిసార్లు విచిత్రంగా అనిపిస్తుంటుంది. కొందరు ఏ పని చేతకాక.. సోమరితనంతో.. ఈజీ మనీ కోసం దొంగతనాలకు అలవాటు పడుతుంటారు. మరికొందరు పరిస్థితుల కారణంగా దొంగలుగా మారుతుంటారు. దీనికి సరైన ఉదాహరణే ఈ స్టోరీ. భార్యకు భరణం చెల్లించడం కోసం దొంగగా మారిన వ్యక్తి చెప్పిన విషయాలు తెలుసుకుంటే ఆశ్చర్యం కలగక మానదు. భార్యకు భరణం కట్టేందుకు దొంగతనం చేసిన ఘటన మహారాష్ట్ర నాగ్ పూర్ సమీపంలో చోటు చేసుకుంది. మన్యాపూర్ లోని గణపతినగర్ కు చెందిన కన్నయ్య నారాయణన్ బౌరుషి అనే వ్యక్తి చైన్ స్నాచింగ్ చేసి దొరికిపోయాడు. 74 ఏళ్ల మహిళ మెడలో చైన్ దొంగిలించడంతో ఈ కేసు వెలుగులోకి వచ్చింది.

జయశ్రీ జైకుమార్ గాడే అనే 74 ఏళ్ల మహిళ ఫిబ్రవరి 22న మనిష్ నగర్ ఏరియాలో తన చైన్ ఎత్తుకెళ్లారని కంప్లైంట్ ఇచ్చింది. దీంతో కేసు బుక్ చేసి దర్యాప్తు చేసిన పోలీసులు ఎట్టకేలకు చైన్ స్నాచర్ ను పట్టుకున్నారు.

**భరణం చెల్లించేందుకే..**

చైన్ కేసు ఫిబ్రవరీలో కంప్లైంట్ ఇస్తే మొత్తానికి జులై లో దొరికిపోయాడు దొంగ. కెమెరాలు, స్థానిక దొంగల నుంచి లభించిన వివరాలతో ఎట్టకేలకు పట్టుకున్నారు. అయితే విచారణ సందర్భంలో కన్నయ్య చెప్పిన వివరాలు విని పోలీసులు షాక్ అయ్యారు. తప్పని పరిస్థితుల్లో దొంగతనాలకు అలవాటు పడినట్లు చెప్పాడు. నెలకు రూ.6 వేలు తన మాజీ భార్యకు భరణం చెల్లించాలని.. అందుకే చైన్ స్నాచింగ్ చేస్తున్నట్లు చెప్పాడు. విడాకుల కేసులో తన భార్యకు నెలకు రూ.6000 చెల్లించాల్సిదిగా కోర్టు తీర్పు ఇచ్చిందనీ.. అప్పటినుంచి దొంగతనాలు చేస్తున్నట్లు చెప్పాడు.

కన్నయ్య కోవిడ్–19 (కరోనా) సమయంలో రెండో వివాహం చేసుకున్నాడు. అయితే గత రెండేళ్లుగా ఉద్యోగం లేక ఇబ్బందులు పడుతున్నాడు. కోర్టు తీర్పు ప్రకారం నెలనెలా భరణం కట్టాల్సి ఉందని.. ఉద్యోగం లేక.. డబ్బులు లేక దొంగతనాలు చేసి భరణం చెల్లిస్తున్నట్లు చెప్పటంతో ఆశ్చర్యానికి గురయ్యారు పోలీసులు. ఈ రెండు మూడు నెలల్లో నాలుగు చైన్ స్నాచింగ్ చేసినట్లు ఒప్పుకున్నాడు.

**గోల్డ్ వ్యాపారి అరెస్టు:**

విచారణలో గోల్డ్ ఎక్కడ అమ్ముతున్న విషయం చెప్పాడు కన్నయ్య. దొంగిలించిన గోల్డ్ ను కొంటున్న వ్యాపారిని పోలీసులు అరెస్టు చేశారు. శ్రీ సాయి జువెల్లర్స్ కు చెందిన అమర్దీప్ కృష్ణారావు నఖతే ను అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. చట్టప్రకారం దొంగిలిచన సొమ్మును కొనటం, అమ్మటం నేరం అని చెప్పారు. నిందితుడు చెప్పిన వివరాల ప్రకారం.. అతను అమ్మిన వస్తువులు కొన్న వారిని ఐడెంటిఫై చేశారు. వారి నుంచి ఒక బైక్, మొబైల్ ఫోన్, 10 గ్రా. బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ దాదాపు రెండు లక్షల రూపాయలు ఉంటుందని చెప్పారు పోలీసులు.

# తోపులు ఎవరూ లేరటగా.. కేంద్ర నాయకత్వానికి పూర్తిగా అర్థమయినట్లుందిగా

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లో భారతీయ జనతా పార్టీకి ఓటు బ్యాంకు లేదు. మోదీ చరిష్మా ఉన్నప్పటికీ స్థిరమైన ఓటు బ్యాంకు కొన్ని దశాబ్దాల నుంచి లేదు. నేటికీ ఆ ఓటు బ్యాంకు శాతం మాత్రం పెరగలేదు. టీడీపీతో పొత్తు పెట్టుకుని పోటీ చేసిన నాడే ఏదో నాలుగైదు సీట్లువస్తాయి. ఇక్కడ పార్టీ అధ్యక్షులు మారినా.. సామాజికవర్గాల పరంగా ఎంపిక చేసినా.. ఫలితం లేదు. అనేక ప్రయోగాలు చేసిన కేంద్ర నాయకత్వం చివరకు ఆంధ్రప్రదేశ్ లో ఒంటరిగా వెళ్లలేమని డిసైడ్ అయినట్లుంది. అందుకే తొలి నుంచి పార్టీని నమ్ముకున్న వారికి మాత్రమే కీలక పదవులను అప్పగిస్తూ వస్తుంది. ఎవరికీ విడిగా పోటీ చేసే పరిస్థితి లేదు. 2019లో బీజేపీ ఒంటరిగా పోటీ చేసి ఉద్దండులైన వారంతా ఓటమినే చవి చూశారు.

**వ్యక్తిగత సత్తా లేదని...**

ఎవరూ గెలవలేదు. కొన్ని చోట్ల అయితే డిపాజిట్లు కూడా రాలేదు. ఇప్పుడు పొత్తుతో ఎన్నికయిన పురంధ్రీశ్వరి పార్లమెంటు సభ్యురాలిగా విశాఖలో ఒంటరిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. మొన్న




పొత్తుతో రాజమండ్రి నుంచి గెలిచారు. విష్ణుకుమార్ రాజు 2014లో గెలిచారు. 2014 ఎన్నికల్లోనూ ఎమ్మెల్యేగా గెలిచారు. అంతే తప్ప 2019 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి గెలవలేకపోయారు. ఇక సోము వీర్రాజు కూడా అంతే. కన్నాలక్ష్మీనారాయణ నరసరావుపేట ఎంపీగా 2019 ఎన్నికలలో పోటీ చేసి ఓడిపోయి మొన్న టీడీపీలో చేరి సత్తెనపల్లి ఎమ్మెల్యేగా గెలిచారు. ఇలా చాలా ఎవరిని తీసుకున్నా బీజేపీ ఒంటరిగాపోటీ చేసినప్పుడు తోలని చెప్పుకుంటున్న వారు కూడా గెలవలేకపోయారు.

**అందుకే అన్ని పదవులను...**

అంటే బీజేపీకి ఏపీలో ఏ మాత్రం ప్రజాదరణ, ఓటు బ్యాంకు ఉందో అర్థం చేసుకోవచ్చు. నాయకత్వ లేమితో పాటు ఎవరికీ వ్యక్తిగత ఇమేజ్ లేదని, వారికి గెలిచే సత్తా లేదని రికార్డులు చెబుతున్నాయి. అందుకే బీజేపీ కేంద్ర నాయకత్వం కూడా ఈ సారి గెలిచినప్పటికీ పార్టీలో తామే కీలకం అని భావిస్తున్న వారిని పక్కన పెట్టింది. కేంద్ర మంత్రి పదవిని శ్రీనివాసరాజుకు ఇచ్చింది. రాష్ట్ర మంత్రి పదవిని సత్యకుమార్ యాదవ్ కు కేటాయించింది. రాజ్యసభ పదవిని పాక సత్యనారాయణకు ఇచ్చింది. అంటే కమలం పార్టీ నాయకుల సత్తా కేంద్ర నాయకత్వానికి అర్థమయిందనే అంటున్నారు. అందుకే పార్టీ వీరికి పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదని చెబుతున్నారు. ఇటీవల బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కూడా పార్టీకి నమ్మకంగా ఉన్న మాధవ్ ను ఎంపిక చేసిందంటున్నారు. మొత్తం మీద కేంద్ర నాయకత్వానికి రాష్ట్ర నాయకుల మీద విశ్వాసం లేదన్నది మాత్రం అర్థమయినట్లు కనిపిస్తుంది.

# హైదరాబాదీలూ.. ఈరోజు కూడా జాగ్రత్త.. బయటకు రాకపోవడమే మంచిది




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ నగరంలో నేడు కూడా కుండపోత వర్షం కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్ వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. నిన్న కురిసిన వర్షానికే నగరం తడిసి ముద్దయింది. ఈరోజు కూడా భారీ వర్షం పడుతుందని వాతావరణ శాఖ చెప్పడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. శనివారం కావడంతో కొంత మేర సాఫ్ట్ వేర్ సంస్థలకు సెలవులు కావడంతో ఒకరకంగా ఇబ్బంది ఉండదు. అదే సమయంలో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లి ఇళ్లకు చేరడంపైనే తల్లిదండ్రులు భయపడిపోతున్నారు.

**అల్పపీడన ప్రభావంతో...**

అల్పపీడనం ప్రభావంతో పాటు రుతుపవనాలు బలంగా విస్తరించడంతో రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావం కారణంగా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు పడతాయని చెప్పింది. కొన్ని జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. గంటకు ముప్పయి నుంచి నలభై కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. అధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్ గిరి, జగిత్యాల, కామారెడ్డి, కరీంనగర్, ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, నల్లగొండ, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, సిరిసిల్ల, సంగారెడ్డి, సిద్ధిపేట, హనుమకొండ, యాదాద్రి జిల్లాలకు ఎల్లో అలెర్ట్ ప్రకటించారు.

**ఈరోజు ఏపీలో...**

ఆంధ్రప్రదేశ్ లో ఈరోజు కూడా మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశముందని విశాఖ వాతావరణ కేంద్రం తెలిపింది. తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, శ్రీసత్యసాయి, అనంతపురం, నంద్యాల, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం, పల్నాడు, బాపట్ల, గుంటూరు, ఎన్టీఆర్, పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని తెలిపింది. కృష్ణా, ఏలూరు, కాకినాడ, అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం తెలిపింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అలెర్ట్ గా ఉండాలని ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ ప్రకటించింది. అలాగే పిడుగులు పడే అవకాశమున్నందున చెట్ల కింద ఉండవద్దని కూడా పశువుల కాపర్లను, రైతులను హెచ్చరించింది.

# మళ్లీ షాకిచ్చిన బంగారం ధరలు.. ఎంత పెరిగాయంటే?



**హైదరాబాద్ పెన్ పవర్:** బంగారం ధరలు భగభగమంటున్నాయి. ధరలు అదుపులోకి రావడం లేదు. ఈ ఏడాదికి ఏమయిందో తెలియదు కానీ.. ధరలు ఇంతగా పెరగడం గతంలో ఎన్నడూ లేదని వ్యాపారులు కూడా చెబుతున్నారు. బంగారం ధరలు పెరగడం అంటే.. పదో పరకో పెరుగుతూ గతంలో పెద్దగా ఆర్థికంగా సమస్యలు లేకుండా చేశాయి. అందుకే కొన్నేళ్ల నుంచి ధరలు పెరుగుతున్నా కొనుగోళ్లపై మాత్రం ప్రభావం పడటం లేదు. కానీ ఈ ఏడాది అలా కాదు. భారీగా ధరలు పెరిగాయి. ఎవరూ కొనలేని స్థాయిలో ధరలు పెరగడం ఆందోళనకు గురి చేస్తుంది. అందుకేఈ ఏడాది మొదటి నుంచి ప్రారంభమైన బంగారం ధరల పెరుగుదల ఇప్పటి వరకూ ఆగలేదు. ఇక ఆగుతుందన్న నమ్మకం కూడా లేదు.

**లక్షకు చేరువలో...**

బంగారం ధరలు లక్ష రూపాయలకు మళ్లీ చేరువవుతున్నాయి. గతంలో రెండుసార్లు లక్ష రూపాయలకు పైగానే టచ్ చేసిన బంగారం ధరలు మళ్లీ కొంత తగ్గి ఊరిస్తున్నట్లు అనిపించినప్పటికీ మళ్లీ పెరుగుదల చూస్తే ఈ ఏడాదిలో ముచ్చటగా మూడోసారి లక్ష రూపాయలకు చేరుకుంటుందన్న అభిప్రాయం మార్కెట్ వర్గాలలో వ్యక్తమవుతుంది. లక్ష రూపాయలకు చేరుకుంటే ఖచ్చితంగా అది కొనుగోళ్లపై ప్రభావం పడుతుంది. అంతర్జాతీయంగా మార్కెట్ లో నెలకొన్న ధరల ఒడిదుడుకులు, ద్రవ్యోల్బణం, డాలర్ తో రూపాయి తగ్గుదల, విదేశాల్లో నెలకొన్న మాంద్యం వంటి కారణాలున్నాయి. ఈ ఏడాది కొన్ని దేశాల మధ్య నెలకొన్న యుద్ధాలు కూడా బంగారం ధరల పెరుగుదలకు ఊతమిచ్చాయి.

**వెండి తగ్గి...**

బంగారం కొనుగోలు చేయాలంటే సామాన్యులకు సాధ్యం అయ్యే పరిస్థితి లేకుండా పోయింది. వెండి ధరలు కూడా బంగారం ధరలతో పోటీ పడి పరుగులు పెడుతున్నాయి. అందుకే ధరలు పెరిగి కొనుగోలుపై ప్రభావం చూపుతున్నప్పటికీ పెద్దగా తగ్గడం లేదు. ఈరోజు దేశంలో బంగారం ధరలు స్వల్పంగా పెరిగాయి. వెండి ధరలు మాత్రం స్వల్పంగా తగ్గాయి. పది గ్రాముల బంగారం ధరలపై పది రూపాయలు పెరిగింది. కిలో వెండి ధరపై వంద రూపాయలు తగ్గింది. మధ్యాహ్నానికి బంగారం, వెండి ధరలు పెరగవచ్చు. తగ్గవచ్చు. లేక స్థిరంగా కొనసాగవచ్చు. 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 91,110 రూపాయలకు చేరుకుంది. 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 99,390 రూపాయలుగా నమోదయింది. కిలో వెండి ధర 1, 23, 800 రూపాయలుగా ట్రేడ్ అవుతుంది.

# గజగజలాడిన హైదరాబాద్... భారీ వర్షంతో అతలాకుతలం




**హైదరాబాద్  పెన్ పవర్:** హైదరాబాద్ లో భారీ వర్షం కురుస్తుంది. గత రెండు గంటల నుంచి కురుస్తున్న వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రధానంగా ఉప్పల్, ఉస్మానియా యూనివర్సిటీ, విద్యానగర్, నల్లకుంట, ఎల్బీనగర్, చైతన్యపురి, దిల్ సుఖ్ నగర్, సరూర్ నగర్ , సికింద్రాబాద్, మేరేడుపల్లి, చిలకలగూడ ప్రాంతాల్లో భారీ వర్షం నమోదయింది. రోడ్లపైకి వరద నీరు చేరడంతో విద్యాసంస్థల నుంచి బయలుదేరిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా స్కూలు బస్సులు, ఆటోలు వర్షపు నీటిలో చిక్కుకున్నాయి. రోడ్డు మీద నీరు చేరడంతో కొన్ని చోట్ల మొరాయించాయి. దీంతో వాహనాలను తోసుకుని ముందుకు రావాల్సి వచ్చింది. ఇంజిన్ లోకి నీరు పోవడంతో ద్విచక్ర వాహనాలు మొరాయించాయి.

**వీకెండ్ కావడంతో...**

వీకెండ్ కావడంతో హైదరాబాద్ నగరంలో ప్రయివేటు వాహనాలన్నీ బయటకు వచ్చాయి. దీంతో రహదారుల్లో ట్రాఫిక్ మరింతగా స్థంభించిపోయింది. వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరికలు జారీ చేసింది. వీలయినంత వరకూ ఈరోజు కూడా బయటకు రాకుండా ఇంట్లోనే ఉండాలని, భారీ వర్షం నమోదయ్యే అవకాశముందని చెప్పింది. కొన్ని ప్రాంతాల్లో వర్షపు నీరు ఇళ్లలోకి చేరాయి. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరడంతో వస్తువులన్నీ వర్షార్పణమయ్యాయి. భారీ వర్షం కురియడంతో అనేక ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాను అధికారులు నిలిపివేశారు. దీంతో చీకట్లు అలుముకుని నీరు బయటకు తోడుకోలేక ప్రజలు అవస్థలు పడ్డారు.

**మ్యాన్ హోల్స్ మూతలు తెరిచి...**

హైదరాబాద్ నగరంలో వర్షం వచ్చినప్పుడల్లా ఇదే పరిస్థితి తలెత్తుతోంది. మ్యాన్ హోల్స్ ను దుకాణ యజమానులు తీసి వేస్తుండటంతో ప్రమాదకరంగా మారింది. మ్యాన్ హోల్స్ మూతలను ఎవరూ తొలగించవద్దని, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ సిబ్బంది మాత్రమే తొలగిస్తారని, వారు తొలగిస్తే అక్కడ బోర్డులను ఏర్పాటు చేస్తారని, అప్పుడు ప్రమాదాలు జరగవని చెబుతున్నారు. అయినా కొందరు దుకాణాల యజమానులు వర్షపు నీరు తమ దుకాణాల్లోకి రాకుండా మ్యాన్ హోల్స్ తెరుస్తున్నారు. మలక్ పేట్ వద్ద రహదారిపై మ్యాన్ హోల్స్ తొలగించడంతో అక్కడ దుకాణాల యజమానులతో మున్సిపల్ సిబ్బంది గొడవకు దిగారు. కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# ఈ డైట్?కు షిఫ్ట్ అయితే.. షుగర్ వ్యాధిని ఈజీగా కంట్రోల్ చేయొచ్చు.. వెయిట్ కూడా తగ్గొచ్చు !



**హైదరాబాద్  పెన్ పవర్:**షుగర్ ఎంత తియ్యగా ఉంటుందో.. ఆ వ్యాధి వచ్చిన వారి జీవితం అంత చేదుగా తయారవుతుంది. ఏం తినాలన్నా.. ఏం తాగాలన్నా రిస్ట్రిక్షన్స్ తో వేగలేక పోతుంటారు.. అప్పుడప్పుడు రూల్స్ బ్రేక్ చేసి తినేసి.. బ్లడ్ లో చక్కెర పెరిగింది బాబోయ్ అంటూ మళ్లీ హాస్పిటల్స్ బాట పడుతుంటారు. జీవితాంతం నచ్చిన ఫుడ్డుకు దూరంగా ఉండాల్సిందేనా.. మందులు వాడాల్సిందేనా..? అనే విచారంతో కాలం వెళ్లదీస్తుంటారు. కానీ ఎలాంటి మందులు లేకుండా డయాబెటిస్ ను కంట్రోల్ చేయొచ్చంటున్నారు సైంటిస్టులు.

చక్కెర వ్యాధిని కంట్రోల్ చేసేందుకు వెగాన్ ఫుడ్ కు మారాలంటున్నారు శాస్త్రవేత్తలు. ట్యాబ్లెట్స్, ఇంజెక్షన్లు లేకుండా న్యాచురల్ గా తగ్గించే ఉత్తమమైన మార్గాలలో ఇది మొదటి వరుసలో ఉంటుందని చెబుతున్నారు. దీని వలన షుగర్ తగ్గటం, వెయిట్ లాస్ మేనేజ్మెంట్ కోసం సులువైన మార్గం ఇది అని అంటున్నారు. కేవలం 12 నెలలు వేగాన్ డైట్ తీసుకోవడం వలన వచ్చే మార్పుల గురించి వివరించారు. వేగాన్ డైట్ అంటే.. యానిమల్ ప్రొడక్ట్స్ లేకుండా ప్లాంట్ బేస్డ్ డైట్.. అంటే జంతు సంబంధిత ఉత్పత్తులు కాకుండా చెట్ల నుంచి వచ్చే ఉత్పత్తులతో చేసే ఆహారం. 12 వారాలపాటు పండ్లు, కూరగాయలు, బీన్స్ (చిక్కుడు జాతి కూరగాయల), అన్ని రకాల ధాన్యాలు డైట్ లో భాగంగా తీసుకోవటమే వెగాన్ ఫుడ్. ఈ ఫుడ్ తీసుకోవటం వలన 12 రోజులలో దాదాపు 5 కేజీల వెయిట్ తగ్గారట.

వ్యాయామం, మెడిసిన్ లలో ఎలాంటి మార్పులు లేకుండా ఈ ఫలితాలు సాధించినట్లు పరిశోధనలో తేలింది. హై ఫైబర్ (పీచు పదార్థం), తక్కువ కేలరీలు, లైట్ గా ప్రాసెసింగ్ చేసిన పిండి పదార్థాల వలన వెయిట్ తగ్గటం, షుగర్ స్థాయిలు తగ్గటం మంచి రిజల్ట్ అని చెబుతున్నారు. వీటి వలన బ్లడ్ షుగర్ కంట్రోల్ ఉండటంతోపాటు ఇన్సులిన్ రెసిస్టెన్స్ ను తగ్గిస్తుందని తెలిపారు. ఎలాంటి డ్రగ్స్, మెడిసిన్ లేకుండా షుగర్ కంట్రోల్ లో ఉండేందుకు ఇప్పుడు చాలా మంది డాక్టర్లు సలహా ఇస్తున్నారు.

**వెగాన్ ఫుడ్ వలన లాభాలు:**

ఈ డైట్ లో హై ఫైబర్ ఉండటం వలన ఊబకాయం రాకుండా (లావు కాకుండా) కంట్రోల్ చేస్తుంది. ఈ ఫుడ్ తీసుకోవటం వలన సంతృప్తి కూడా ఎక్కువగా ఉంటుందట.

పండ్లు, కూరగాయలలో తక్కువ కేలరీస్ ఉండటం వలన వెయిట్ మెయింటైన్ చేయడం ఈజీ

ఈ డైట్ తో ఇన్సులిన్ సెన్సివిటీ ఇంప్రూవ్ అవుతుందని చెబుతున్నారు. అంటే ఇన్సులిన్ అనే హార్మోన్ ను కణాలు తొందరగా స్వీకరిస్తాయి. ఇది షుగర్ లెవల్స్ కంట్రోల్ లో ఉండేందుకు తోడ్పడుతుంది.

డైట్ లో ఫైబర్ ఎక్కువగా ఉండటం వలన రక్తం లోకి షుగర్ చాలా స్లోగా చేరుతుంది. దీనివలన బ్లడ్ షుగర్ తగ్గేందుకు అవకాశం ఉంటుంది.

## గంగానదిలో తేలుతున్న 3 క్వింటాళ్ల రాయి.. శ్రీరాముడి లీల అంటూ భక్తుల పూజలు..



**హైదరాబాద్  పెన్ పవర్:**ఉత్తర్ ప్రదేశ్ లోని ఘాజియాపూర్ లో వింత ఘటన చోటు చేసుకుంది. గంగానదిలో భారీ రాయి తేలుతూ కనిపించింది. సుమారు 3 క్వింటాళ్ల బరువున్న రాయి నీటిపై తేలుతూ కనిపించడంతో ఇది శ్రీరాముడి లీల అంటూ పూజలు చేస్తున్నారు జనం. ఇందుకు సంబందించిన వీడియో నెట్టింట వైరల్ గా మారింది. విన్న ఎవరికైనా ఆశ్చర్యాన్ని కలిగించే ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. ఉత్తర్ ప్రదేశ్ లోని ఘాజియాపూర్ లో గంగానదిలో భారీ రాయి తేలుతున్న వీడియో నెట్టింట వైరల్ గా మారింది. సుమారు 3 క్వింటాళ్ల బరువున్న రాయి నీటిపై అలవోకగా తేలడం చూసి ఆశ్చర్యపోయిన స్థానికులు ఇది శ్రీరాముడి లీల అంటూ పూజలు ప్రారంభించారు. ఈ రాయికి రామసేతుతో సంబంధం ఉందని అంటున్నారు భక్తులు.నదిలో తేలుతున్న రాయిని ఒడ్డుకు తీసుకొచ్చి తాడుతో కట్టి పూజలు చేస్తున్నారు భక్తులు.గంగానదిలో తేలుతున్న రాయి త్రేతాయుగం కాలం నాటిదని కొంతమంది.. విష్ణువు, శివుడికి సంకేతమని మరికొంతమంది అభిప్రాయపడుతున్నారు. అయితే కొంతమంది మాత్రం.. ఈ రాయికి దైవంతో ఎలాంటి సంబంధం లేదని, ఇది అగ్నిపర్వత లావాలో ఏర్పడ్డ ప్యూమిస్ రాయి అని అంటున్నారు. ప్యూమిస్ రాళ్ళు నీటిలో తేలుతాయని సోషల్ మీడియాలో పలువురు నెటిజన్స్ కామెంట్ చేస్తున్నారు.

ఈ ఘటనపై సోషల్ మీడియాలో మిశ్రమ స్పందనలు వస్తున్నాయి.. కొంతమంది దీనికి దైవం, పురాణాలతో సంబంధం ఉందని వాదిస్తుంటే మరికొంతమంది సైంటిఫిక్ రీజన్స్ తో వారి వాదనను కొట్టిపడేస్తున్నారు.

## మియాపూర్‌లో స్కూల్ బిల్డింగ్ పై నుంచి పడి 10వ తరగతి విద్యార్థి మృతి




**హైదరాబాద్  పెన్ పవర్:** 10వ తరగతి విద్యార్థి స్కూల్ బిల్డింగ్ పై నుంచి కిందపడి మృతి చెందాడు. ఈ విషాధ ఘటన మియాపూర్?లోని మధుర నగర్?లో జరిగింది. వివరాల ప్రకారం.. రిజ్వాన్ (15) అనే బాలుడు మధుర నగర్?లోని సెయింట్ మార్టిన్ స్కూల్?లో 10వ తరగతి చదువుతున్నాడు. రోజుమాదిరిగానే శనివారం (జూలై 19) పాఠశాలకు వెళ్లిన రిజ్వాన్.. ప్రమాదవశాత్తూ స్కూల్ బిల్డింగ్ నాలుగో అంతస్తు నుంచి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన రిజ్వాన్?ను పాఠశాల సిబ్బంది హుటాహుటిన ఆసుపత్రికి తరలించింది.గాయాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రిజ్వాన్ మరణించాడు. కుమారుడి మృతితో రిజ్వాన్ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. రిజ్వాన్ ప్రమాదవశాత్తూ కిందపడ్డడా.. లేక మరేదైనా కారణం ఉందా అన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

# డబ్బు విషయంలో తేడాలు.. భార్యతో అఫైర్ ఉందనే డౌట్.. మలక్‌పేట కాల్పుల కేసులో వీడిన మిస్టరీ



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ సిటీలోని మలక్ పేటలో కలకలం రేపిన కాల్పుల ఘటనలో పోలీసులు ఐదుగురిని అరెస్ట్ చేశారు. ఈ కాల్పుల్లో నిందితులు టార్గెట్ చేసి చంపేసిన చందు నాయక్?ను చంపింది నెల్లూరుకు చెందిన సుపారీ గ్యాంగ్‌గా పోలీసులు గుర్తించారు. చందు నాయక్ హత్యకు రాజేష్ సుపారీ ఇచ్చినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఏడు రౌండ్లు కాల్పులు జరిపి చందు నాయక్?ను రాజేష్ ముఠా చంపేసింది. ఈ హత్యకు సంబంధించిన వివరాలను హైదరాబాద్ సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్య కుమార్ మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కేతావత్ చందు నాయక్?ను జులై 15న గన్?తో కాల్చి చంపారు. హత్యకు గురైన చందు నాయక్ సీపీఐ పార్టీ స్టేట్ కమిటీ సభ్యుడుగా కొనసాగుతున్నాడు. స్విఫ్ట్ కారులో వచ్చిన దుండగులు కాల్పులు జరిపి పారిపోయారు. సీసీ కెమెరాలు, ప్రత్యక్ష సాక్షులు, గతంలో కొన్ని కేసుల ఆధారంగా నెల్లూరుకు చెందిన ఒక ముఠా హత్య చేసినట్లు దర్యాప్తులో తేలింది. మలక్ పేట శాలివాహన నగర్ పార్క్ దగ్గర జరిగిన ఘటనకు ముందు రోజు దుండగులు రెక్కీ నిర్వహించి హత్య చేశారు. హత్య చేసిన నిందితులను దొంతి రాజేష్ అలియాస్ రాజేష్, కుంభ ఏడుకొండలు, శ్రీను, అర్జున్ జ్ఞాన ప్రకాష్, లింగిబేడి రాంబాబు, కందుకూరి ప్రశాంత్?లుగా గుర్తించినట్లు డీసీపీ చైతన్య కుమార్ తెలిపారు.సీపీఐ (ఎం. ఎల్) పార్టీకి చెందిన రాజన్న అలియాస్ రాజేష్ సీపీఐ పార్టీలో చేరుతానని చందు నాయక్?ను కోరాడు. గతంలో వీళ్లిద్దరూ కలిసి గుడిసెలు వేసిన క్రమంలో బాధితుల నుంచి కొంత డబ్బు వసూలు చేశారు. ఈ డబ్బుల విషయంలో ఇద్దరికీ తేడాలొచ్చాయి. ఈ హత్యకు సంబంధించి గతంలో వసూలు చేసిన 13 లక్షలు కూడా కారణంగా తేలింది. చందు నాయక్ బామ్మర్దికి, బిల్డర్ బాల్ రెడ్డికి మధ్య జరిగిన గొడవలో బాల్ రెడ్డిని రాజేష్ బెదిరించి 15 లక్షలు తీసుకున్నాడు. అయితే.. ఈ డబ్బును చందు నాయక్?కు రాజేష్? ఇవ్వలేదు. అప్పటి నుంచి చందు నాయక్?కు, రాజేష్?కు మధ్య శత్రుత్వం పెరిగింది.రాజేష్?కు ఒక మహిళతో ఉన్న అక్రమ సంబంధాన్ని చందు నాయక్ రాజేష్ భార్యతో కలిసి బట్టబయలు చేశాడు. అప్పటి నుంచి.. రాజేశ్ భార్యతో చందు నాయక్?కు అక్రమ సంబంధం ఉందని రాజేష్ అనుమాన పడ్డాడు. రాజేష్, చందు నాయక్ మధ్య వివాదం ముదరడంతో పార్టీ పెద్దల సమక్షంలో చర్చలు జరిపి రాజీ కుదిర్చారు. అయినా రాజేష్ తన కోపాన్ని వీడలేదు. ఈ క్రమంలోనే చందు నాయక్ హత్యకు రాజేష్ ప్లాన్ చేశాడు. ఏపీలోని నెల్లూరుకు చెందిన గ్యాంగ్?కు సుపారీ ఇచ్చి చందు నాయక్ ను రాజేష్ హత్య చేశాడు.

# “డబ్బు లేకే నాన్న చనిపోయారు”.. కన్నీటి పర్యంతమైన ఫిష్ వెంకట్ కూతురు

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలుగు సినీ ఇండస్ట్రీలో తనదైన తెలంగాణ యాస, హాస్యంతో ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేసిన నటుడు ఫిష్ వెంకట్ (ముంగిలంపల్లి వెంకటేష్) , తీవ్ర అనారోగ్యంతో కన్నుమూశారు. దాదాపు వందకు పైగా చిత్రాలలో హాస్య, విలన్ పాత్రలు పోషించి గుర్తింపు తెచ్చుకున్న ఆయన శుక్రవారం (జులై 18, 2025) రాత్రి తుది శ్వాస విడిచారు. కిడ్నీ, కాలేయ సంబంధిత సమస్యలతో పోరాడిన ఆయనకు అవయవ మార్పిడి అవసరమని వైద్యులు తెలిపారు. దీనికి దాదాపు రూ. 50 లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పడంతో, కుటుంబం ఆర్థిక సాయం కోసం ఎదురుచూసింది. దాతల నుంచి సరైన సాయం అందకపోవడంతో చివరకు ఆయన మృత్యువుతో పోరాడుతూ కన్నుమూశారు. ఫిష్ వెంకట్ అంత్యక్రియలు శనివారం( జులై 19, 2025) న హైదరాబాద్‌లోని మారేడ్‌పల్లిలోని హిందూ స్మశానవాటికలో హిందూ సంప్రదాయ పద్ధతిలో జరిగాయి. ఆయన పార్థివ దేహాన్ని సికింద్రాబాద్‌లోని అడ్డగుట్టలో ఉన్న ఆయన నివాసం వద్ద ఉంచారు. అభిమానుల సందర్శన అనంతరం అంతిమయాత్ర కొనసాగించింది. 'గబ్బర్ సింగ్' టీమ్, అభిమానులు కన్నీటి వీడ్కోలు పలికారు. అయితే ఫిష్ వెంకట్ మృతిపై టాలీవుడ్ పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తామంతా ఒకే సినీ కళామతల్లి బిడ్డలం అని చెప్పుకునే వారు



ఇప్పుడు కనీసం మృతదేహాన్ని చూడడానికి కూడా రాలేరా.. అని ప్రశ్నిస్తున్నారు.

**మోసపూరిత ప్రచారంతో దెబ్బతిన్న సాయం..**

ఈ కష్టకాలంలో, ఫిష్ వెంకట్ కుమార్తె స్రవంతి భావోద్వేగంతో మీడియాతో మాట్లాడుతూ, తమ కుటుంబానికి ఎదురైన చేదు అనుభవాలను వివరించింది. హీరో రామ్ చరణ్ లక్షల రూపాయల ఆర్థిక సాయం చేశారంటూ సోషల్ మీడియాలో అసత్య ప్రచారం జరిగిందని, దీనివల్ల తమకు ఎవరూ సాయం చేయలేదని ఆమె వాపోయింది. ప్రభాస్ పీఏ నంటూ ఓ నకిలీ కాల్ వచ్చిందని, కిడ్నీ మార్పిడి ఖర్చు తాము భరిస్తామని చెప్పారని, కానీ అది మోసమని తర్వాత తెలిసిందని శ్రావంతి కన్నీటిపర్యంతమైంది. తమకు ఎవరైనా సాయం చేస్తారనే ఆశతో వచ్చిన ప్రతి ఫోన్ కాల్‌కు సమాధానం ఇచ్చామని, కానీ మోసపోయమని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

**డబ్బు లేకపోవడం వల్లే నాన్నను కోల్పోయాం**

“నాన్నకు కిడ్నీ మార్పిడి జరిగి ఉంటే బతికేవారు. డబ్బు లేకపోవడం వల్లే నాన్నను కోల్పోయాం “ అని స్రవంతి బోరున విలపించింది. ఈ మాటలు సినీ పరిశ్రమలో నిస్సహాయ స్థితిలో ఉన్న కళాకారుల పరిస్థితిని కళ్ళకు కట్టినట్లు చూపించాయని నెటిజన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోట్ల రూపాయలు కూడగట్టుకున్న నటీనటులు తోటి కళాకారుడికి సాయం చేసేందుకు కూడా చేతులు రావడం లేదా.. అని సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు. కష్టకాలంలో వారికి అండగా నిలబడాల్సిన బాధ్యత పరిశ్రమ పెద్దలపై ఉందని అనేక మంది అభిప్రాయపడుతున్నారు.

**కొద్దిపాటి సాయం, పరామర్శకు కరువై..**

ఆర్థిక సహాయం విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, కొందరు సినీ ప్రముఖులు ఫిష్ వెంకట్ కుటుంబానికి అండగా నిలిచారు. పవన్ కళ్యాణ్ రూ. 2 లక్షలు ఆర్థిక సాయం అందించగా, విశ్వక్ సేన్ , జెట్టి ఫేమ్ కృష్ణ మానినేని కూడా తమవంతు సహాయం చేశారని స్రవంతి వెల్లడించింది. అలాగే, రామ్ చరణ్‌కు చెందిన క్లీంకార ఫౌండేషన్ నుంచి రూ. 25 వేల సాయం అందిందని కూడా ఆమె పేర్కొంది. అయితే, సరైన సమయంలో కిడ్నీ దాత దొరకకపోవడం, చికిత్సకు అవసరమైన పూర్తి నిధులు సమకూరకపోవడంతో తన తండ్రి పరిస్థితి విషమించి కన్నుమూశారని కన్నీటి పర్యంతం అయింది. నాన్న మరణించిన తర్వాత, తమను పరామర్శించేందుకు 'గబ్బర్ సింగ్' టీమ్ తప్ప సినీ ఇండస్ట్రీ నుంచి పెద్దగా ఎవరూ రాలేదని ఆవేదన తెలిపింది. మా అన్న పిష్ వెంకట్ ఫ్యామిలీని ఆదుకునే విధంగా తమ వంతు సాయం అందిస్తామని గబ్బర్ సింగ్ టీం తెలిపింది.

తనదైన శైలిలో హాస్యంతో ప్రేక్షకుల మెప్పించిన ఫిష్ వెంకట్ లేని లోటు తెలుగు సినీ పరిశ్రమకు తీరనిది. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నారు నెటిజన్లు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పరిశ్రమ పెద్దలు దృష్టి సారించాలని కోరుకుందాం అని తమ సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నారు..